కామకవి

కామన్నకు లక్షణము రాదు; వ్యాకరణ మసలే రాదు. పదిపుస్తకము లయితే చదువుకొన్నాఁడు కాని అతనికి వానిలో ప్రతి పదమును అర్థమయినదన్న మాటయు లేదు. కాని అతఁడు చాటువద్యము చెప్పినాఁడన్నచో గాలి దాని నన్ని దిక్కులకు తీసికొనివెళ్లినటులు ప్రచారమయిపోవును.

కొంగను కొట్టిన బోయవానిపై వాల్మీకి యొక్క ఆదికవిత్వము బయలుదేఱినది : కోపముచేసి గురువుగారి మీఁద కామన్న యొక్క ఆదికవిత్వము బయలుదేఱినది. దానితో కామన్న కామకవి అయినాఁడు.

గురువుగారి కోపమునకు ఒక హేతువున్నది. అసలు గురుశిష్యుల మార్గములే భిన్నములు. గురువు గారికి గులకరాలవలె నోరికడ్డముపడు పదములు, టెంకాయ పాకము కల పద్యము లనినచో ప్రాణము. వారాపద్యములు వివరించి వివరించి చెప్పుచుండెడివారు; వానినే వల్లింపుమను చుండెడువారు.

ప్రయత్నముచేసి తెలిసికొనవలసిన పద్యములనినచో శిష్యునికి శిరోవేదన; గులక రాలవంటి పదము లనినచో నతనికి దవడతీపు; టెంకాయపాక మనినచో వాని కోఁకర.

ఇటులొక రేటికి, మఱియొకరు కోటికి తీయుట చేత కామన్న చదువు మూలఁ బడినది. అతఁడు కామకవి అయిపోవుటచే గురువుగారి కడకు రాకపోకలు చేయవలసిన పని తీఱిపోయినది. కాని అతఁడు మంచి దనుకొన్న పుస్తకములు తెప్పించి చదువుకొన మొదలుపెట్టినాఁడు. గురుబోధలేకయే తెలియుచుండుటవలనఁగలిగిన గర్వముయొక్క మహావేగముచే చాల పుస్తకములు పఠించినాఁడు. ఒకొక్క పుస్తకమును రెండు మూఁడు నాలుగు మాఱులను పఠించి చెఱకును సగము మాత్రమే నమలఁగలిగితి నని అనుకొనఁ జొచ్చెను.

ఏదేని వస్తువనుభవపతితమై మనస్సు విశాలమైనపు డతఁడదేపనిగా కవిత్వమల్లును. 'ఈవేళ ఏమిపద్యములు చెప్పితివి? వినిపింపు' మని అందఱును అతనికడ పడిగాపులు కాయుచుండువారు. కామకవి మనోహరముగా వానిని గానముచేసి వారివారిని తనుపుచుండువాఁడు. అతని పద్యములను ఆ పద్ధతితో పత్రికలు ప్రకటించుకొను

చుండెడివి. 'ఈ పత్రికలో కామకవి పద్యములున్నవా'యని చదువరు లడుగు చుండెడువారు. పండితలోకము మాత్రము 'అబ్బే! అతి తేలిక పాకము! అఁడుదానికి కూడ అర్థమగును. ఒక అనుప్రాసమా? ఒక శ్లేషయా? ఒక బంధమా? ఒక ఏకాక్షరకందమా?' అని అనుకొను చుండెడువారు.

2

బాపట్లలో కామకవి చుట్టాలయింట వివాహము. కామకవి రయిలులో బాపట్లకు బయలుదేఱెను. అవి కాలేజీలు, హైస్కూళ్లు తెఱచురోజులు కాఁబట్టి విద్యార్థులు గుంపులు గుంపులుగా ఆ రైలులోనే చెన్నపట్నము వెళ్లుచున్నారు.

క్రొత్తవానికి రైలులో పోవుటయే ప్రొద్దుపోక. అతఁ డెల్లపుడును గుమ్మముకడనే కూరుచుండి నేల రివ్వునఁ బరువెత్తుట చూచును; వంతెన లెన్నియున్నవో, ఏస్టేషను ఏవైపుననున్నదో గుఱుతుపెట్టుకొనును; దగ్గఱ డైరీయున్నచో అందు వ్రాసికొనుచుండును; ప్రతిస్టేషను లోను తాను దిగిపోవువానివలె తలుపుకడకు పరుగెత్తును. తెరువరులకు వాఁ డొకపిచ్చివాఁడేకాని పాప మమాయికుఁడు.

ప్రాఁతవానికి రైలొక యాతన. 'అబ్బా! ప్రతిష్టేషనులోను వన్నుందు నేమి?' అని నిందించును. చీట్లపేకయో, ఫలాహారమో, సంగీతమో, వివాదమో లేనిచో ప్రొద్దుపోదు. దానిమాట యేమి? రైలే కదలదు. వాఁడితరులమీఁద కాళ్లుపెట్టి నిదురించును. అయ్యది తన స్వగృహమయినటులు తెరువరులను లోనికిరాకుండ గెంటును. వాఁడు దిగిపోవునపుడు ఆ స్థలమును శ్మశానము వలె విసర్జించి లేచిపోవును.

ఆ రైలులో పయనించు వెంకటరావునకు కాలేజీ విద్యార్థులందఱికంటె పాటలోను, భాషలోను ఆసక్తియున్నది. అతఁడు కామకవిని పోల్చి ఆ బండిలోనే తానును పయనించుట సఫలమని కామకవితో అనెను.

గాయకుఁ డనినను, కవియన్నను కడు లోకువ. అడుగుటయే తరువాయిగా కొందఱును, మొగమును కనిపట్టియే కొందఱును గానముచేయ నారంభింతురు. ఒకవేళ తాము బెట్టుచేసి వినిపింపకున్నచో, ఇంకను లోపమున్నదని సరస్వతి లోలోపల నవ్వుకొని పోవునేమోయని వారు భీతిల్లుదురు. కాఁబట్టి వారించుమించుగా 'public property'.

వెంకటరావు కోరికమీఁద కామకవి లోఁగడ తాను చెప్పిన చాటుపద్యములు వినిపింప మొదలిడెను. అతని పాటధోరణికొంత గుఱ్ఱపుకదనువలెను, కొంత వృక్షచలనమువలెను, పోనుపోను ధూమశకటధ్వనినే శ్రుతిగాఁ జేసికొన్న ఒకానొక నిశ్చలో చ్చైస్స్వరమున సంపన్నమయి యుండెను. అతని ముఖమున ఆనందము వెల్లవేయఁబడి

నటులుండెను. సభ్యులలో నెటచను అలికిడి లేదు. అపుడు ధూమశకటముకూడ తనచప్పుడు నుపసంహరించుకొని వానిగానమును వినుచున్నదా యనునటులు దానిధ్వని యెవరికిని గోచరించుటయేలేదు. తెనాలిస్టేషను కడ రైలు నిక్కముగా చప్పుడుమాని ఆఁగి వినఁదొడఁగినది. కామకవి కవితాస్వరము రెండింతల వికాసముతో జనుల నాకర్షించినది. వినుటకే కాఁబోలు రైలు అక్కడ పదినిమిషము లెక్కువ ఆఁగినది.

శ్రుతిలేనిపాట కష్టమని రైలు మఱల శ్రుతివేసెను. అతఁడీశ్వర లీలపై వ్రాసిన పద్యములు ప్రతివానిని పాతులోనికి కదిలించి వైచినవి. అతఁడు క్రమక్రమముగా వానిని చదివి చాలించెను.

'భాషా సంగీత'మని ఒకఁడు, 'భావసంగీత'మని ఒకఁడు 'wave of bliss' అని ఒకఁడు, 'Gamut of Appolo' అని ఒకఁడు, 'Song of the Soul' అని ఒకఁడు కీర్తించిరి.

రుచిభేదములేక పదార్థమని ఒకటి ఉండదు. నిందలేక స్తుతి పూర్ణముకాదు. స్వరూపసాక్షాత్కారములేని భక్తుఁడు భగవంతుని దివ్య కళ్యాణగుణముల నుతించి నుతించి నిందింప మొదలిడును. నిషేధము విధిలో లీనమయినపుడే అది సమగ్రమయి యుండును.

అపు డచట వినుచున్న వారలలో వైయాకరణ శిరోమణియగు అనంతకృష్ణశాస్త్రి అతని కవితనంతయు వినివిని తుదకు కామకవిని చూచి "అయ్యా తామేమి పఠించితి'రని యడిగెను.

"అయ్యా! నేనేమియు చదువుకొనలేదు."

"ఆ సంగతిని మీకవిత్వమే చెప్పక చెప్పుచున్నది. అనఁగా వాచ్యముగా చెప్పుచున్నది. మీరు దండిపండితు లయిననఁగాని మీకవిత్వము రాణింపదు. అది యటుండె. మీరేమి చదివి దీనిని వ్రాసినారు?"

"అయ్యా! నాకటులు తోఁచినది; వ్రాసితిని. ఇటులు చెప్పుటకు, ఏమిచదువు కొనుట, కేమిపని?"

"ఓహో! వ్యాకరణము రాక కవిత్వమా! అది సపిండీకరణము; అలంకారము లేక కారము; పాకము లేక శోకము; శయ్య లేక కొయ్య, వ్యంగ్యము లేక భంగ్యము. కవిత్వమనఁగా గొల్లసుద్దులా? నైషధము చూచితివా? చూచుకొలఁది దానినుండి ఏంతలు దొంతులుగా పుట్టుకొనివచ్చును. కవిత్వమనఁగా అది; అది విద్వత్ కవిత్వము - విద్వత్కవయః కవయః కేవలకవయః కేవలంకవయః" అని రెండు శ్లోకములు చదివి వ్యాఖ్యాన మనువదించి అందలి ఒకొక్క పదమునకు వ్యుత్పత్తి ప్రత్యయోత్పత్తి

నిఘంటువులు, వ్యంగ్యవీచికలు, అలంకారములు, శయ్యలు, పాకములు మొదలగువానిని అనంతకృష్ణశాస్త్రి ఉపన్యసించుచుండఁగా బావట్ల వచ్చెను. అతఁడు 'నాయనా! చెడిపోవుచున్నావని ఇంతవట్టు చెప్పితిని. ఇఁకనైనను చదివి విద్వత్కవివి కమ్ము' అనియెను.

"మీ కడనే చదివికొనవలయునా?" అని కాలేజీ విద్యార్థులనిరి. అనంతకృష్ణశాస్త్రి ఈర్ష్యనే ఒకచూపుగా చూచెను.

అనంతకృష్ణశాస్త్రి శిష్యులూరక కూర్చుండలేదు. "కామకవిగారూ! వండుక ప్రయోగించితిరే; ఇదెటులు సాధువు? అర్ధానుస్వార శకటరేఫ సాంకర్యము కలిగించితిరే? అది కవిత్రయానుమతమా? 'దేవానాంప్రియ' శబ్దమును అన్యసమాసఘటితము చేసితిరే! అది అపాణినీయమే!" అనుచు ప్రశ్న పరంపర పరఁగించిరి.

"అయ్యా! నాకవియేవియురావు. నాకటులుతోఁచి నది; చెప్పితిని. లెస్సగా నున్నయెడల వినుఁడు; లేదా పోనిండు" అని కామకవి యూరకుండెను.

"కవిత్వమునకు వ్యాకరణదోషములకును ఏమియు సంబంధములేదు. వేమన్న పద్యముల కానందింతురు. తప్పులు పట్టరేల? వానిలో తప్పులు లేవా? పండితులు తప్పులనుకొను తప్పులతడకయే అది. కాని ఆ తప్పుల నతిక్రమించి అందలికవిత్వ మత్యెత్తినది" అని కాలేజీ విద్యార్థులు స్వతంత్రవాదమును నెలకొల్పఁ దొడఁగిరి.

ఈ వాదమును సహింపనిదానివలె రైలు గుప్పు గుప్పుమని ధ్వనిచేయుచుఁ బట్టాలపై అనేక జర్ఝర స్వరము లుదయింప వాని శాసించుచందమున తానును అఱచుచు స్టేషను ముందాఁగెను. అనంతకృష్ణశాస్త్రి శిష్యసమేతుఁడై దిగిపోయెను. కాలేజీ విద్యార్థులు జయవెట్టుచు కామకవిని దింపిరి. కొంతవడికి రైలు అలపుసొలపులులేని తన నడకను క్రమ్మఱసాగించెను.

స్టేషనునుండి గ్రామములోనికి జననిర్ఝరి బయలు దేఱినది. కామకవియే దాని కడపటిబిందువు. అతఁడేదియో లోప మొనరించిన వానివలెఁ బెండ్లి యిల్లు చేరెను.

3

కామకవికి పెండ్లి సందడియంతయు ముండ్లదండడి వలె నుండెను. అనంత కృష్ణశాస్త్రి చేసిన నింద ఒకమూర్తి తాల్చి అతని కనుల వ్రేలుచుండెను. అతఁడు:-

"అ పరితోషా ద్విదుషాం
స సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్;
బలవదపి శిక్షితానా
మాత్మ న్యప్రత్యయం చేతః" అను పద్యము నూరక చదివికొనుచుండెను.

స్తుతింపుము; గుండేని యెగురును. నిందింపుము; బెండేనిగ్రుంగిపోవును. స్తుతిని తేనెనుండియు, నిందను తేనెటీఁగల ముండ్లనుండియు తీసియుందురు. ఈరెంటికి చిన్ననాఁటనుండియు శాశ్వతికమగు పోరు.

కామకవి స్తుతి కుబ్బలేదు కాని నిందకుగ్రుంగిపోయెను. పండితులన్నచో నతనికి భయమెత్తెను. పాణినియు నన్నయయు వ్యాకరణములు వ్రాయకుండిన నిటువంటివారి కెంతటి మేలు? అతనిలోనిపుడు పాణిని నన్నయాదులందు శ్రద్ధాబీజము పడెను. ఏమనఁగా పెండ్లికి వచ్చిన బంధువులలో పండితు లందఱు "కామకవీ! ఏమి చదువుచున్నావు?" అని అడిగినపుడు తాను గుటకలు మ్రింగుటకన్న నేమి ప్రత్యుత్తర మీయఁగలఁడు? శిష్యులను జూచినపుడు తన్నేమి వెంటఁబడి యడిగిపోదురో యని బెంగపడి వారికి దూరముగా వర్తించుచుండెను. శిష్యులు నిక్కముగా వేఁటకుక్కలు. వారు ఇతర శిష్యులను ఉడుములవలె వెంటాడుదురు. కామకవికి వారి గాటు బాగుగా తెలియును.

సదస్సున అవధానులు వేదము చెప్పిన పిదప, పండితులును శిష్యులును కొన్ని శ్లోకములతో ఆశీర్వదించి వానికి మూఁడు, నాలుగు, ఐదు, ఆఱు అర్థములు చెప్పినపుడు కామకవికి శాస్త్రమురాని లోపము అద్దమున చూపించినటులాయెను. అపు డతఁడు ముమ్మొదట గురువుగారికిని తనకును గలిగిన మార్గభేదమును స్మరించెను.

కామకవి ఇల్లు చేరెను. వివాదపడిన గురువుకడ చదువ నతనికి చిన్నతనము తోఁచెను. కొన్నాళ్లకు తిరుపతివెళ్లి అచటి పాఠశాలలో వ్యాకరణశాస్త్ర మారంభించెను. తీరుపాటయినపుడెల్ల కొన్ని వ్యాకరణసూత్రములను పద్యములలోనికి మార్చుచుండెను. అందొకటి యుదాహరించుట అనావశ్యకము కాఁబోదు.

క. 'హోఢ' యన ఝల్ పరంబున
వ్యూఢం బగుచోఁ బదాంత మొనరినచోనున్,
హోఢా యగు లిహ్సు' అనన్
రూఢిగ 'లిఢ్' అగు బదారురుక్షువులారా!

ఇటులే కువలయానంద మంతయు పద్యములుగా మాఱుచున్నది. అమరము బట్టీపెట్టి నోరికానువదముల నేఱుకొనుచున్నాఁడు. ఇఁకఁ దనసమానసము విశాలమయినపుడు చెప్పు ప్రతిపద్యమునందును ఏ శ్లేషయో, ఏ గూఢవ్యంగ్యమో, ఏ ప్రాసమో లేకుండ లేదు. తొల్లి తనపద్యములను వినిపించి ఇతరుల నానందపఱచు

వాఁడు. కామకవిచుట్టు జనులు మూఁగుచుండువారు. ఇపుడో ఏకాంతమందు తన పద్యములు తానే చదివి తానే యర్థము చెప్పికొని తానే ఆనందించుకొనుచున్నాఁడు.

కొన్నాళ్ల కతనికి కవిత్వము చెప్పుటకే తీరిక లేకపోయినది. గురువుగారు చెప్పిన పాఠమును వినుట తాను మరలచూచికొనుట, ఇంకొకరికడ చింతనచేయుట, తెలివితక్కువవాని నొకనిచూచి వానికి తాను మరల చింతన చెప్పుట, వెనుకటి పాఠము లేకరువు వేసికొనుట, ముందు గ్రంథము చూచికొనుట వీనితో అతనికి గాలి గూడఁ బీల్చికొనుట కవకాశము లేకుండఁబోయినది. అతఁడిపుడు* కవిత్వపు Vacuum అయినాఁడు.

కవిత్వ మెంతెంత అడుగు పట్టినదో శాస్త్ర మంతంత పెరుఁగుచువచ్చినది. కామకవి క్రమముగా భాష్యాంతము వ్యాకరణము, బాధాంతము తర్కము, అలంకారశాస్త్రము చదివికొన్నాఁడు. శాస్త్రాభ్యాసము పూర్ణమయినపిదప ఇల్లు చేరెను. శిష్యులు పలువురు చేరిరి. అతనికి ఇపుడు పాఠములు చెప్పుటతో సరిపోవుచున్నది. నడుమనడుమ పూర్వవాసనల వలన ఒకటిరెండు పద్యములు చెప్పుచు వచ్చుచున్నాఁడుగాని వానిని శిష్యులు తక్క ఎవరును ఆలకించుటలేదు. పూర్వపరిచయమువలన ఇతరు లెవరేని విననారంభించినను పూర్తికాకమునుపే లేచిపోవుచు "జల మల్లిపోయినది" అని అనుకొందురు. కామశాస్త్రి వీరికేమియు తెలియదని లోలోపల ననుకొనుచుండును. శిష్యులు మాత్రము గురువుగారు చెప్పిన సారస్యములను వారములకు వెళ్లినపుడు వారివారికి బోధించుచుండువారు; కాని వారు 'మాకు కొబ్బరికాయలు వలదయ్యా, అరఁటిపండ్లు కావలయు'నని అనుచుండువారు, శిష్యులు, విద్వత్కవిత్వ మనఁగా 'గొల్లసుద్దులును సువ్వాలపాటలునా?' అని అనుచుండువారు.

4

ఆంధ్రదేశమున శతావధానసభలు, అష్టావధాన సభలు, ఆశుకవితాసభలు వేలపువెట్టిగా జరిగిన పిదప ఆలోచించి ఆలోచించి వ్రాసియుంచిన ఖండకావ్యములను, భావకవిత్వములను, పాటలను వినిపించు సభలు చిత్తుచిత్తుగా జరుగుచున్నవి. ఒక ఉపన్యాసకునకు మఱొక యుపన్యాసకునకు పొత్తు కలియుట లేదు. వక్తలు చెప్పునది శ్రోతలకు తెలియుటలేదు. ఇంచుమించుగా ఆ కాలమున కవిత్వపు అరాచకము ఉదయించినది. విమర్శకులు వింతవింతల సిద్ధాంతముల నెలకొల్పఁ దొడఁగిరి. అపు డెంతమంది కవులు బయలుదేఱిరో అంతమంది విమర్శకులును వారికి సహోదరులవలె బయలుదేఱి వారి కవితలమీఁద దీర్ఘవిమర్శముల వ్రాయుచుండిరి.

పూర్వపరిచితి వలన కామకవికిఁగూడ ఒక సమితి తరపున ఆహ్వానము వచ్చినది. ప్రకృతము కామకవి కడ తాను శాస్త్రాభ్యాసము చేయుకాలమున రచించిన పద్యములు తక్క మతివిశేషపద్యము లేమియులేవు. అతఁడు వానిని వ్రాసియుంచుకొనలేదు గాని అతనికడ చినుఁగని తగులఁబడని - ఎత్తుకొనిపోఁబడని - ధారణాగ్రంథ మొకటి కలదు. కామకవి తత్సామగ్రితో ఉపన్యాస వేదిక నెక్కెను. అతఁ డా ధారణాగ్రంథము విప్పి ఒకపద్యము చదివి దానికి వ్యాఖ్యాన మారంభించెను. ఒకొక్కపదమే నిర్వచించుచు ప్రయోగముల ఉదాహరించుచు తాత్పర్యము చెప్పుచుండెను. సభ్యు లొకరి మోము ఒకరు చూచుకొనుచుండిరి.

కొంతవడి కొకసభ్యుఁడు లేచి వినయముతో "అయ్యా, వ్యాఖ్యానము చెప్పనక్కఱలేని పద్యములు మాత్రమే చదువుఁడు. అథవా వ్యాఖ్యానమేని మానుడు" అని కోరెను.

కామకవి వ్యాఖ్యానముమాని మూలము చదువుచుండెను. 'ఇది అరబ్బీ' అని ఒకఁడు, 'పాండిత్యము యొక్క కవితావేషము' అని ఒకడు, 'Galvanised iron' అని యొకఁడు అఱచుటకు వెనుదీయలేదు.

అందఱు 'కామకవి కామశాస్త్రి అయిపోయినాఁ' డనిరి. అగ్రాసనాధిపతియు కామకవియుఁదక్క సభ్యులెంతసేపో లేరు. కామకవికి కవితాసమితుల కాహ్వానము మరి రాలేదు.

కామకవి ప్రథమ గురువుతో వివాదమును, కాలేజీ విద్యార్థుల స్తుతియు అనంతకృష్ణ శాస్త్రి మందలింపును, నేఁటి సభ్యులయనాదరమును తలపోసి 'లోకోభిన్నరుచిః' అనుకొన్నాఁడు. అతనికి సభ్యులపై కొంచెమాగ్రహము కలుగక మానలేదు. "శాస్త్రవాసన యిసుమంతయు నెఱుఁగని వీరికేమి తెలియును? లోకమునకు నచ్చు పుస్తక మొకటి రచించి యచ్చొత్తించినఁగాని నాసంగతి వీరి కెఱుక పడదు" అని అతఁడు తలఁచెను.

అష్టాదశవర్ణనముల చిఠా, విభావానుభావ సంచారిభావ వ్యభిచారి భావముల లక్షణము, శతాధికాలంకారములు, సర్వవ్యంగ్యములు, నిఘంట్వరణ్యానిలో అసూర్యంపశ్యములైన పదములు, బంధముల జాబితాలు కంఠబద్ధము లయియే యున్నవి కావున అతఁడు వానిని ప్రతిపదమందు భావించి భావించి ప్రబంధరచనకుఁ గడఁగెను. విద్యార్థులకు వేళకు పాఠమందుట లేదు; ఒకొక్క రోజున అసలు లేనేలేదు. ఇంటివా రెవరికిని వేళకు భోజన మందుటలేదు.

కొన్నాళ్లకా ప్రబంధము తయారయినది. ఆలోచించి ఆలోచించి దానికి రెండు పేరులు పెట్టినాఁడు. ఒకటి 'కవితా విజయ'మని; రెండు 'కావ్యరాజ' మని.

చూడవచ్చిన ప్రతిపండితుని పది రోజులుంచుకొని వినిపింప మొదలిడినాఁడు. పండితులందఱు 'అమ్మా' అంటే 'అమ్మా' అన్నారు. కామకవి ఒకనాఁడు పని కట్టుకొని పోయి అనంతకృష్ణశాస్త్రి కాప్రబంధమును వినిపించి ప్రశంసాపత్రికను తెచ్చికొనెను. కామకవి తనజన్మము సఫలమయిన దనుకొనెను. ఎవరు తనను నిందించిరో వారే తనను నుతించుటకంటె విజయము వేఱెచటనున్నది? దానిడబ్బు నదియే గడించు కొనుననను గర్వముతో ఏ రాజునకు దానిని కృతి యీయకయే అప్పు తెచ్చి 'కవితా విజయ' మను మాఱుపేరుకల ఆ 'కావ్యరాజము'ను అతఁడు అచ్చు వేయించెను.

స్వరూపము తాల్చిన ఆ సరస్వతి తనయింట నధివసించుటకు ఏఁబదిరూకలు వెచ్చించి ఒక బీరువానతఁడు చేయించి ఆ పుస్తకముల నతిశ్రద్ధతో నతఁడు చక్కగా అందు పేర్చెను. పత్రికలలో అడ్వర్‌టైజ్‌మెంట్లకు ఇన్నూఱు రూకలు వ్యయపఱిచెను. రిప్లైకార్డులు అచ్చొత్తించి గ్రంథభాండాగారముల కన్నిటికిఁ బంపించెను. నోటీసు లచ్చువేయించి కవర్లలో పెట్టి గొప్పవారికిఁ బంపించెను. పోస్టునకు విరామము లేని పనికలిగెను.

మొత్తము మీఁద పది పదేనుగురు పుస్తకమును వి.పి.పి.గా పంపవలసినదని లేఖలు వ్రాసిరి.

గ్రంథభాండాగారాధి పతుల కడనుండి "అయ్యా! మేము పది సంవత్సరములనుంచీ ఈ భాండాగారమును నడుపుతూ వున్నాము. మేము విద్వత్కవులురాసే పుస్తకాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తాము. జగత్పండితులును విఖ్యాత కవులును అగు మీరు రచించిన ఈ కావ్యరాజముచే మాభాండాగారము నలకరించు కొనవలెనని తీర్మానించుకొన్నాము. అయితే సరస్వతి కుండే సహజ దారిద్ర్యముచే ఉచితముగా తమ గ్రంథము దయచేయుఁడని ప్రార్థిస్తూ వున్నాము" అని రిప్లై ఉత్తరములు కామకవి కడకు ప్రవహింపఁ జొచ్చినవి.

మఱికొందఱ కడనుండి – "అయ్యా! నేను గ్రంథములు కొనఁదగినంత ధనికుణ్ణికాదు; అయితే, చిన్నప్పటినుండీ చదువుమీఁద వుండే ఆసక్తివల్ల ప్రతిగ్రంథమూ చూడాలనే ఆశ అధికంగా వుంది. ఎంతమంది ఎన్నిమాటలు చెపితే ఏమి ప్రయోజనం? తమ కవిత్వానికి మిగతావన్నీ పిపీలికాయమానాలు. ఈ కవరులోనే తాము గ్రంథం పంపడానికి పోస్టుబిళ్లలు పెట్టుకోవడ మైనది" అని ప్రార్థనలు వచ్చుచున్నవి.

ఇటువంటి ప్రార్థనాపత్రికలు చూచుకొనుటకంటె ధనపత్రమును చూచుకొనుటయే కామకవి కిష్టతరము. ఎటుచూచినను ఒక ఆర్డరు కనఁబడుట లేదు. అతనికి బీరువా చూచుచో భయము పుట్టుచున్నది. అందే వస్త్రమిఱికింపను తావు లేదు. పైఁగా ఇంటిలో

చాలస్థలమాక్రమించినది. రోజులు కడచిన కొలఁది పుస్తకములు మీఁద బూఁజు పెరుఁగుచున్నది. రెణ్ణాళ్ల కొకతూరి దులపనియెడల చెద లెక్కుచున్నది.

కామకవి పండువులలో విమర్శకుల నింటికి విందులకు పిలిచెను. కవిత్వము, కావ్యము, రసము, భాష ఈ మొదలగువానిపై తనపాండితిని వెల్లడించి, తన కావ్య రాజములోని కొన్ని పద్యములు వినిపించి, వ్యాఖ్యలు కురిపించి దానిని పత్రికలలో విమర్శింపవలసినదని ప్రస్తావించెను. విమర్శకులు కావ్యరాజముపై దీర్ఘవ్యాసములు వ్రాసి పత్రికలకుఁ బంపిరి. కాని ఏ పత్రికయు ఆ వ్యాసములను బ్రకటింపలేదు. కామకవి ఆర్డర్లకు నిరీక్షించెను గాని వృధా అయెను."ఇన్ని రూపాయలుపోసి అచ్చువేయించితినిగాని అచ్చుఖర్చైన మళ్లలేదు" అని చింతించెను. బీరువాతలుపు తీసిచూచినపు డతనికా పుస్తకములు పితృదేవతల శల్యములవలెఁ గానఁబట్టుచున్నవి. మచ్చునకు కొన్ని యిచ్చుచో వ్యాప్తికలుగునను నమ్మకముతో ఉచితముగాఁ గోరినవారి ఉత్తరములు వెదకి కొన్ని నట్పేటుగా పంపినాఁడు; కాని అవి కొన్నాళకు తిరిగివచ్చినవి. "అయ్యయో! – నమః ప్రామాణ్యావాదాయ మత్ కవిత్వాపహారిణే" అని అనుకొన్నాఁడు.

శిష్యుల కందఱకు కావ్యరాజము పాఠము చెప్ప మొదలిడినాఁడు. మొదట ప్రథమగురువుపై తనకెంత కోపము వచ్చినదో కవిత్వము చెప్పనేర్చిన కొందఱు శిష్యులకు తనపైని అంత కోపము వచ్చినది. ఆ కోపమే వారి లోని కవితావాసనను పూర్తిగా జాగరిల్లఁ జేసినది. మఱి వారికి పాఠము చెప్పనక్కఱలేకపోయినది; కాని, కవితావాసన లేని శిష్యులు కావ్యరాజమునే ఒకశాస్త్రముగా పఠింపఁ దొడఁగిరి.

కామకవి బస్తీలలోనున్న తన శిష్యులకందఱకు 'మీరును మీ అనుయాయులును ప్రతి పుస్తకశాలలోను "కావ్యరాజము కలదా? కావ్యరాజము కలదా?" అని పలుమాఱులు అడుగవలసినది' అని ఉత్తరములు వ్రాసెను. వారిలో నెవ్వరును గురువాక్యమును జవదాఁటలేదు. పదిమంది పదిపర్యాయములు అడుగట తోడనే కావ్యరాజములకు Demand ఉన్నదని షాప్ కీపర్ల మనస్సులకు నాఁటినది.

అపుడే ఆంధ్రపత్రికలోను కృష్ణాపత్రికలోను 'కావ్యరాజము; ఇది యొక మహాకావ్యము; విద్వత్కవులయిన కామశాస్త్రిగారిచే విరచితము; విమర్శక శేఖరులైన విశంకటశాస్త్రిగారిచే విమృష్టము; కొలఁది ప్రతులే కలవు; ఈనెలలోఁగా తీసికొనువారికి రెండురూకలు మాత్రమే. వలయువారు గ్రంథకర్త కామకవిగారికి, బెజవాడ అని వ్రాసినఁ బడయఁగలరు' అని చిత్రమైన డిజైనుల మధ్య అడ్వర్‌టైజ్‌మెంటు ఆకర్షకముగా మఱల ప్రకటింపబడినది.

పుస్తకములకు ఆర్డర్లు రాఁదొడఁగినవి. కామకవి కత్తెర చేత పుచ్చుకొని కాకితములు కత్తరించి పాకెట్లు కట్టి వి.పి.లు పంపెను. కామకవి బీరువా సగము ఖాళీ అయి అంగళ్ల బీరువాలలో క్రిక్కిఱిసినవి. అచ్చోటినుండి అవి విముక్తి కాలేదు. ఇపుడు దుకాణదారులు వాని విముక్తికి తీవ్రముగా ఆలోచించుచున్నారు.

● *ఆం.ప.ఉ.సం. ప్రభ - 1927* ●